క్లుప్తంగా

'చలో మహబూబ్‌నగర్' వాల్‌పోస్టర్ విడుదల

కొత్తకోట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల నేతలు కలిసి పట్టణంలోని జామియామసీద్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 26న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును రద్దు చేసే వరకు కొనసాగించాల్సిన ప్రణాళికను, ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



కొత్తకోట: పట్టణంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి కార్మిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి లేబర్ అధికారి ఏఎల్‌ఓ వేణుగోపాల్ చలివేంద్రం ప్రారంభించారు. వేసవి కాలంలో కార్మికుల దాహార్తిని తీర్చేందుకు కార్మిక శాఖ ద్వారా తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసినట్లు వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో లేబర్ జూనియర్ అధికారి రఫీ, మద్దిలేటి, బొబ్బిలినిక్సన్, వెంకటయ్య, ఎజాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన గంధం చిట్టెమ్మకు రూ.14వేలు, రాజేశ్వరికి రూ.21వేల సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లారావు బుధవారం అందజేశారు.

రూ.10 వేల ఆర్థికసాయం

ఇటీవల మృతిచెందిన ఐకేపీ ఉద్యోగి గంధం చిన్నరాములు కుటుంబాన్ని పుల్లారావు పరామర్శించి, రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

బోరుమోటారు మరమ్మతు



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామంలో మినీ వాటర్ ట్యాంకులకు తాగునీటిని అందించే బోర్లు రిపేర్లకు గురికావడంతో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అధికారి నర్సింహ మరమ్మతు చేయించి ట్యాంకులకు నీరు వదిలారు. గ్రామంలో నల్లకుంట వద్ద ఉన్న బోరు మోటారు కాలిపోవడం, రాగిరేటికుంట వద్ద స్టాటర్‌తో పాటు ఇతర వస్తువులు చెడిపోవడంతో గ్రామంలోని మినీ ట్యాంకర్లకు నీటి సరఫరా ఆగిపోయింది. గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను గమనించిన నర్సింహ వెంటనే వాటికి మరమ్మతు చేయించారు.

సకాలంలో టీకాలు వేయించాలి



పాన్‌గల్: చిన్నారులు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్లను ఆయన సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకాలు వేయించుకోవడంతో అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు తారశశాంక్, వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సంతోషదేవి, సరళ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మక్తల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూడీఓ జయ అన్నారు. బుధవారం మక్తల్‌లో మినీ ఫంక్షన్‌హాల్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ మండలాలు, జక్లేర్ సెక్టార్లల్లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు హాజరైయ్యారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. గర్భిణులు పౌష్టికాహారం క్రమంతప్పకుండ తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కారన్యక్రమంలో సీడీపీఓ సోజినిమట్ట, సూపర్‌వైజర్ మల్లేశ్వరి, రామశ్వరి, జ్యోతి, రాజేశ్వరి, అరుణ, రాజేష్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పల్లె ప్రకృతి వనాలు

- ఎండిపోతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు
- నిధులు లేక నిర్వహణ భారం



చందాపురం పల్లెప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

వనపర్తి రూరల్: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసి ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఆయా మొక్కలను నాటించి, వాకింగ్ ట్రాకులను, ధ్యానం చేసుకోవడానికి అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ సర్పంచ్‌ల పదవీ కాలం ఉన్నంత వరకు పచ్చదనంతో కళకళలాడాయి. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తర్వాత వాటి నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు.

నిధుల కొరత

పంచాయతీలకు ఎలాంటి నిధులు, ఉపాధి హామీ ద్వారా కూలీలను నియమించకపోవడం, కార్యదర్శులకు పనిభారం పెరగడంతో ఇతర పనులు కూడా వారే చూడాల్సి రావడంతో పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. కూలీలు లేనందున ప్రకృతి వనాల నిర్వహణ చూసుకోవడం ఇబ్బందిగా మారిందని సంబంధింత అధికారులు పేర్కొంటున్నారు. మూడేళ్ల కిందటి వరకు పల్లె పకృతి వనాల నిర్వహణకు హరిత నిధి కింద నిధులు మంజూరయ్యేవి. వాటి ద్వారా వనాలకు అవసరమయ్యే నీటి తడులు, పర్యవేక్షణ కోసం సిబ్బందిని నియమించారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ లోపంతో ప్రకృతి వనంలో మొక్కులు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పల్లెప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం

నిర్వహణ లోపం

గ్రామంలో 2021లో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. బుద్ధుని విగ్రహం, వాకింగ్ ట్రాక్, రాళ్లగుట్టను పచ్చని మొక్కలతో అలంకరించారు. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. మొక్కలను రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– నాగరాజునాయుడు, చందాపురం

మంజూరు కాని నిధులు

ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, బోర్లు అడుగంటిపోవడంతో ట్యాంకర్ల సాయంతో నీటిని అందిస్తున్నా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు గ్రామ పంచాయతీలకు నిధుల కొరత కారణంగా కార్యదర్శులపై నిర్వహణ భారం పడింది.

– రవీందర్‌బాబు, ఎంపీఓ, వనపర్తి

తల్లిదండ్రుల తోడ్పాటు మరువలేనిది



విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసి 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూస్ పేపర్లతో గ్రాడ్యుయేషన్ డే క్యాప్‌లను తయారు చేసి పిల్లలకు అలంకరించారు. పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ సామర్థ్యాలు ప్రదర్శించడంతో ఎంఈఓ వారిని అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి అందిస్తున్న తోడ్పాటుతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయ బృందం వెంకట్‌నారాయణ, వెంకటేష్‌యాదవ్, ప్రేమ్‌సాగర్, బిందు, వలంటీర్ సుజాత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'సీవీ రామన్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సీవీ రామన్ కళాశాల యాజమాన్యం

వనపర్తి విద్యావిభాగం: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ లో టి.చరణ్‌తేజ 993, అర్షియా 993, రాధ 992, టీసీ అక్షయ , విశ్వతేజ 992, ఆర్.సంధ్య 991, కె.అక్షిత 990, తులసి 990 మార్కులు, బైపీసీలో అక్షయ 988, మౌనిక 984, శ్వేత 982, నవ్య 982 మార్కులు, సీఈసీలో వెంకట్ 983, ప్రథథమ సంవత్సరం ఎంపీసీలో సానియా 467, శ్రావణి 465, తనుశ్రీ 464, బైపీసీలో లక్ష్మీనారాయణ 435, మధుమోహన్‌రెడ్డి 431, సూర్యవర్షిణి 428, ఎంఈసీలో నందిని 490, జ్ఞానేశ్వరి 485, సీఈసీలో ఆర్.వైష్ణవి 440 మార్కులు సాధించారని కళాశాల యాజమాన్యం సభ్యులు తెలిపారు.

రైతుల సంక్షేమానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు



కోస్గిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మద్దూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు సూచించారు. బుధవారం మద్దూరులో నూతనంగా డీఆర్‌డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని అయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్, బాబు స్వామి, వెంకట్‌రాములుగౌడ్, మాధవరెడ్డి, పురుషోత్తం, సుభాష్, వెంకటప్ప పాల్గొన్నారు.

కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ-ఐకేపీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, నాగులపల్లి నరేందర్, మోహన్‌రెడ్డి, టెంటు నర్సింహ, సుధాకర్‌గౌడ్, ప్రశాంత్ రెడ్డి, సీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నియంత్రించాలి



పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

పాన్‌గల్: వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వారి రక్షణ కోసం తల్లిదండ్రులు కొంత సమయాన్ని కేటాయించాలని కస్తూర్బా విద్యాలయం ఎస్‌ఓ హేమలత తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం నుంచి విద్యాలయానికి ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో చివరి రోజు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, బాలికల చదువును మధ్యలోనే ఆపి వేయకుండా వారిని ఉన్నతంగా చదివించాలని కోరారు. విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను అందజేసి చదువులో ప్రతిభ చూపిన వారికి, పాఠశాలకు రెగ్యూలర్‌గా హాజరైన విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. విద్యార్థుల కోసం వేచిచూస్తున్న తల్లిదండ్రులు

పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు

ఖిల్లాఘనపురం: పుస్తకాలు మనిషి జీవితానికి దారి చూపే విజ్ఞాన భాండాగారం అని ఎంఈఓ జయశంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన క్లబ్ వారి నుంచి 50 మహనీయుల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం వలన వారు దేశం కోసం, సాటి మనుషుల కోసం చేసిన సేవలు తెలుస్తాయన్నారు. ఏవీఓపీఏ హైదరాబాద్ వారు అందించిన 1,500 పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ మండల కోశాధికారి రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంపిక

వనపర్తి విద్యావిభాగం: మే చివరి వారంలో జరిగే జి–20 స్టూడెంట్ సదస్సులో పాల్గొనే విద్యార్థులకు బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్ తెలిపారు. తుది ఇంటర్వ్యూకు కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని.. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. గూగుల్ మీటింగ్‌లో సుమారు మూడు గంటల పాటు ఐదు రాష్ట్రాల ప్రతినిధులు, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొని జి–20 సదస్సు, పర్యావరణం, వ్యవసాయ మార్కెట్‌లో మధ్య వర్తుల సవాళ్లు-పరిష్కారాలు, సుస్థిర–సమ్మిళిత అభివృద్ధి అనే అంశాలపై ప్రశ్నలు అడిగి ఫైనల్ ఇంటర్వ్యూకు గైడెన్స్ ఇచ్చినట్లు ప్రోగ్రాం అధ్యక్షుడు ధామ్‌సింగ్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఉమా, జి–20 ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ గణేశ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

గోపాల్‌పేట: పాడి పశువులు రోగాల బారిన పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పాలికెపాడులో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా.. జిల్లా, మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. గురువారం 89 తెల్ల పశువులు, 196 నల్ల పశువులకు టీకాలు వేశామని చెప్పారు.

జర్నలిస్టు కాలనీలో బోరుబావి ఏర్పాటు



కొత్తకోట: కానాయపల్లి శివారులో కొత్తగా నిర్మించిన జర్నలిస్టుల కాలనీలో నూతన బోరుబావిని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి ప్రారంభించారు. జర్నలిస్టుల కాలనీలో నీటి వసతిని కల్పించాలని కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. తక్షణమే స్పందించి ఆయన సొంత డబ్బులతో మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌లతో కలిసి భూమిపూజ నిర్వహించి బోరు బావిని తవ్వించారు. దీంతో 3 ఇంచుల నీరు వచ్చినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. త్వరలోనే మోటార్ కూడా బిగించేందుకు సహకారం అందిస్తామని కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, జర్నలిస్టులు రాములు, నాకొండ, ఈశ్వర్, ఖాజామైనోద్దిన్ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: వ్యవసాయ భూమి కొలతల విషయంలో జరిగిన గొడవలో వ్యక్తికి రక్త గాయాలు కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలంలోని కర్నెతండాకు చెందిన జాత్రునాయక్ తన వ్యవసాయ భూమిని సర్వే చేయించాడు. ఈ సమయంలో ఆ భూమికి పక్కన భూమి ఉన్న రైతులు కొడావత్ కిషన్‌తో పాటుగా అతడి తండ్రి లక్ష్మణ్, చిన్న, లక్ష్మణ్, మాన్య, శాంతి, రమేష్ అక్కడికి వచ్చారు. హద్దులు చూపుతున్న సమయంలో వారిని పక్క భూమి వారైన ఇస్లావత్ మాన్య, విజయ్, శ్రీను, సోమ్లా, రవి, కృష్ణతో పాటుగా మరి కొందరు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో వారికి తలకు, శరీరానికి గాయాలయ్యాయి. ఘటనపై కొడావత్ కిషన్ వర్గం, ఇస్లావత్ మాన్య వర్గం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ సురేష్‌గౌడు తెలిపారు.

భూ భారతి చట్టంపై అవగాహన

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై ఈ నెల 25న రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాంద్‌పాష తెలిపారు. మండలంలోని జూరాల రైతువేదికలో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టరు ఆదర్శ్‌సురభి హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి రైతులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమంపై గురువారం ఉదయం 10గంటలకు పట్టణ కేంద్రంలోని బీపీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు కోరారు. కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్‌సురభి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరు కానున్నట్టు తహసీల్దార్ పేర్కొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ గడప ఏర్పాటు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మున్నూరుగేరిలో నిర్మిస్తున్న వేణుగోలపాల స్వామి ఆలయ గడప బండను ఏర్పాటు చేసినట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి రాళ్ల కృష్ణయ్య, కోశాధికారి కొత్త యాదయ్య తెలిపారు. పురాతన కాలంలో నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో కమిటీ వారు పునఃనిర్మించాలని తీర్మానించారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్, బుచ్చిబాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆలయాల నిర్మాణానికి పూజలు



గ్రామ దేవతల పూజలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: గ్రామదేవతల ఆలయాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు భక్తులు సంకల్పించారు. బుధవారం ఆత్మకూర్‌లోని మషమ్మ ఆలయం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమం, కళశాల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆలయంతో పాటు పోచమ్మ, లింగమయ్య, భూలక్ష్మమ్మ, కట్టమైసమ్మ, కర్రెమ్మ, కోటమైసమ్మ గ్రామ దేవతలకు నూతన ఆలయాల నిర్మాణాలకు కలపాకర్షణ ఆవాహనం మహోత్సవ పూజలు చేపట్టారు.

హమాలీ హఠాన్మరణం

పాన్‌గల్: అకస్మాత్తుగా హమాలీ మృతిచెందిన ఘటన బుధవారం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన ఎనుమల బాలయ్య (52) బుధవారం వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా చేసేందుకు వెళ్లి అక్కడే అస్వస్థకు గురయ్యాడు. దీంతో తోటి హమాలీలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



ఆత్మకూర్: వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెంట్ ధరించాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించా. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రోషయ్య, సిబ్బంది రవీందర్, బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడులను కలిసికట్టుగా ఎదుర్కోవాలి



ఖిల్లాఘనపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

ఆత్మకూర్: కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ఆత్మకూర్‌లో వివేకానంద సేవా సమితి, అవోపా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

అమరచింత: ఉగ్రదాడులకు ప్రేరేపిస్తున్న సంస్థలతో పాటు ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఉగ్ర దాడుల్లో మృతి చెందిన వారికి సంఘీభావంగా ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించి, బీజేపీ జెండా కట్ట వద్ద కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, నాయకులు మేర్వరాజు, భాస్కర్, అర్జున్ కుమార్, రాకేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: ఉగ్రవాదుల దాడిలో అమరులైన పర్యాటకులకు సంతాపంగా బుధవారం రాత్రి మండలంలోని కడుకుంట్ల, నాచహల్లి గ్రామాల్లో యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, నివాళులర్పించారు.

గోపాల్‌పేట: సామాన్యుల ప్రాణాలు తీస్తున్న ఉగ్రవాదులను వదిలిపెట్టవద్దని హిందూవాహిని యువకులు అన్నారు. మండల కేంద్రంలో బస్టాండు వద్ద అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు శివ, మిద్దెమహేష్, కొంకి రమేష్, శ్రావన్‌కుమార్, గాజుల సుధాకర్, పార్థు, గోపాల్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండులో పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాళ్ల కృష్ణయ్య, విక్రం, బుచ్చిబాబుగౌడ్, సామ్యనాయక్, వేణు, రవినాయక్, రమేష్, యాదగిరి, గోపి, ఎస్‌ఎల్ మురళి, చిన్న అంజనేయులుగౌడు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..



కడుకుంట్లలో..



అమరచింతలో..



ఆత్మకూర్‌లో..

26న మరికల్‌కు జాన్‌వెస్లీ రాక



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి ఈనెల 26న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మరికల్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ఉపాధి హమీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలంటూ నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారన్నారు. ఈమేరకు బుధవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో విడుదల చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఉపాధి కూలీలతో పాటు వ్యవసాయ కూలీలు, వివిధ రంగాల శ్రామికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి, సీఐటీయూ సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, సుజ్ఞానం, రాఘవేంద్ర పాల్గొన్నారు.